
Follow: @ANNTELUGU
19-07-2026
ANN తెలుగు
మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 196 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కమిటీ కుర్రోళ్ళకు
# నేషనల్ అవార్డ్

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు ప్రకటన
ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.
ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'..
'పుష్ప-2', 'కల్కి', 'లక్కీ భాస్కర్'కు
పలు జాతీయ అవార్డులు.

**ఢిల్లీ, మహా :** భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డుల్లో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ('భ్రమయుగం') మరియు బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ ('చందు ఛాంపియన్') సంయుక్తంగా ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు. 'ఆర్టికల్ 370' చిత్రంలో నటనకు యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డు అందుకోగా, ఉత్తమ చిత్రంగా కూడా 'ఆర్టికల్ 370' నిలిచింది. తెలుగు సినీ పరిశ్రమకు ఈసారి జాతీయ అవార్డుల్లో విశేష గుర్తింపు లభించింది. చిన్న చిత్రంగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్


## ఏపీలో చెత్త లేకుండా చేస్తాం



- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఎనిమిది ప్లాంట్లు నిర్మాణం

02

ఒక్క పెళ్ళిచేసుకున్నవారే..
## రాష్ట్రంలో ఉంటారు



- రాష్ట్రంలోని పౌరులందరికీ ఒకే రకమైన చట్టం
- మధ్యప్రదేశ్ సీఎం సంచలన వ్యాఖ్యలు

02

## బండి–ఈటల అలయ్ బలయ్



- లక్ష్మణ్ నివాసంలో బిజెపి ఇన్ ఛార్జి సంధి చర్చలు

03



మతం మారితే
## ఎస్సీ హోదా వర్తించదు

- సుప్రీంకోర్టు కీలక స్పష్టీకరణ.
- రివ్యూ పిటిషన్ కొట్టివేత.

02

# బుల్లెట్ పై రైతుల భగ్గు

బుల్లెట్ ట్రైన్, బస్ టెర్మినల్ భూసేకరణలో ఉద్రిక్తత







పోలీసులపై కారం చల్లి.. కుర్చీలు విసిరి..
బహదూర్ గూడలో ఆందోళనలు
650 ఎకరాల భూములకు హైడ్రా ఫెన్సింగ్
ప్రభుత్వభూమికే ఫెన్సింగ్ వేశామన్న అధికారులు
ఎక్కడికక్కడ నేతల అరెస్ట్ లు..




**రాజేంద్రనగర్, మహా :** బుల్లెట్ ట్రైన్, శంషాబాద్ బస్ టెర్మినల్ భూసేకరణ ప్రయత్నాలపై రైతులు ఆగ్రహించారు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని బహదూర్‌గూడలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహా పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరి కాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని కోరారు. శనివారం ఉదయం కూడా రైతులు మిగతా 2వ పేజీలో



## చరిత్ర సృష్టించిన
# విక్రమ్-1

- స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు
- విక్రమ్-1 విజయంపై సీఎం రేవంత్ హర్షం
- హైదరాబాద్ కంపెనీ విజయంపై ప్రశంసలు
- 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్ అంటూ ట్వీట్



**శ్రీహరికోట,మహా :** భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్ 1' విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంతో దేశ అంతరిక్ష రంగంలో మరో చారిత్రక అధ్యాయం ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ స్టార్టప్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన ఈ ప్రతిష్ఠాత్మక రాకెట్ శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించబడింది. ఈ విజయంతో భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల సామర్థ్యానికి ప్రపంచస్థాయిలో మిగతా 2వ పేజీలో

## బినామీలపై ఐటీ శాఖ ఉక్కుపాదం

- అవినీతి అధికారుల అక్రమాస్తులపై మరో అస్త్రం.
- వందల కోట్ల అక్రమ సంపద జప్తుకు రంగం సిద్ధం.

02



## పేపర్ లీక్‌లతో లక్షల కుటుంబాలు నష్టపోయాయి

- పరీక్షల వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలి.
- లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ .

03

## సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధం

02

## నేనున్నంత వరకు
# కేసీఆర్ సర్కారు రానివ్వను



- మీకు వేల ఎకరాల భూములెట్ల వచ్చినయ్
- నిజాంను మించిన ధనవంతులుగా ఎలా మారారు
- అందెశ్రీ జయంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్
- అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే 70వేల ఉద్యోగాలిచ్చాం




**హైదరాబాద్, మహా :** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో మిగతా 2వ పేజీలో






# యువతకు అండగా నిలుస్తాం

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మన్నె గోవర్ధన్ రెడ్డి నిప్పులు**

**హైదరాబాద్ , మహా :** "యూత్ డిక్లరేషన్" పేరుతో తెలంగాణ విద్యార్థులను, నిరుద్యోగ యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అదే యువతను ఘోర నిరాశలోకి నెట్టిందని ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా సరూర్‌నగర్‌లో నిర్వహించిన "యువ సంగ్రామ సదస్సు" లో ఖైరతాబాద్ నియోజకవర్గ నిరుద్యోగ యువతతో కలిసి మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలు, నిరుద్యోగ భృతి, నియామకాల భర్తీ, విద్యార్థుల సంక్షేమం వంటి కీలక వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు చెప్పిన మాటలను ఇప్పుడు పూర్తిగా మరచిపోయి, తెలంగాణ యువత ఆశలను, వారి ఉజ్వల భవిష్యత్తును వమ్ము చేసిందని ఆరోపించారు. యువత జీవితాలతో రాజకీయాలు చేసే ప్రభుత్వాలను ప్రజలు ఎన్నటికీ క్షమించరని పేర్కొంటూ, యువతకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ యువత హక్కుల కోసం, ఉద్యోగాల కోసం, న్యాయం కోసం ఈ పోరాటాన్ని రాబోయే రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర యువతకు అండగా నిలుస్తూ, వారి భవిష్యత్తు కోసం ప్రతి వేదికపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సదస్సులో ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వారితో పాటు ఫిలింనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకీ ముదిరాజ్, ఎర్రమంజిల్ డివిజన్ సీనియర్ నాయకులు నిశాంత్ ముదిరాజ్, బిఆర్ఎస్‌వి నాయకులు నవీన్ నాయక్, ఖైరతాబాద్ డివిజన్ నాయకులు శ్రావణ్ మరియు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# బుల్లెట్ పై రైతుల భగ్గు

( మొదటి పేజీ తరువాయి )

ఇక్కడ ఆందోళన చేపట్టారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 650 ఎకరాల భూమికి హైడ్రా సాయంతో కంచె వేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. కంచె వేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి నిరసనలు కొనసాగుతుండగా.. తాజాగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.



**500 గజాల ప్రతిపాదనకు వ్యతిరేకం**

గ్రామస్తులు, రైతులు బుల్లెట్ ట్రైన్, మెట్రో రైల్, బస్సు టెర్మినల్ కు భూ సేకరణ చేసిన వాటికి ప్రత్యామ్నాయంగా నిర్వాసితులకు 500 గజాల ప్రతిపాదనను నిరసిస్తూ శంషాబాద్ జోన్ పరిధి బహదూర్ గూడ రెవిన్యూలో గత వారం రోజులుగా రైతులు రైతు రిలే దీక్షలు చేపడుతున్నారు. శనివారం తెల్లవారుజాము నుండి బహదూర్ గూడ రెవెన్యూలో మహేశ్వరం, ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ పోలీసులు, హైడ్రాధికారులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది సుమారు వెయ్యి మందికి పైగా అధికారులతో కలిసి భూ సేకరణలో భాగంగా ప్రభుత్వ భూములలో చుట్టుముట్టు ఫెన్సింగ్ వేశారు. రైతు రిలే దీక్షకు బిజెపి, బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, బిజెపి నాయకులు రిలే దీక్షలో పాల్గొన్నారు. టెంట్ లో దీక్ష చేపడుతున్న రైతులను ఒక్కసారిగా ఖాళీ చేసే ప్రయత్నం పోలీసులు చేయడంతో మహిళ రైతులు ఒకసారి ఫ్యూచర్ సిటీ డిసిపి యోగేష్ గౌతమ్, శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి, పలువురు ఎస్ఐలు, మహిళా ఎస్సై పై కారంపొడితో పాటు కుర్చీలు, రాళ్లతో దాడులు చేశారు. దీంతో బహదూర్ గూడ భూ సేకరణలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్యాయి. దాడులు చేసిన పలువురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్తీక్ రెడ్డి, తోకల శ్రీనివాసరెడ్డి తదితర నేతలు రైతుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

**బహదూర్ గూడ రైతుల డిమాండ్స్...**

తాతల తండ్రుల కాలం నుంచి ఈ భూములలో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాం. ఒకటి నుంచి 101 వరకు ఉన్న భూ రికార్డులను రెవెన్యూ అధికారులు తారుమారు చేశారు. ఒకటి నుంచి 76 వరకే పట్టా భూములు ఉన్నాయని రికార్డులలో ఉన్నాయి.రాష్ట్ర అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు, కానీ భూమికి బదులు భూమి ఇవ్వాల్సిందే. 500 గజాల ప్రభుత్వ ప్రతిపాదనను నిరాకరిస్తున్నాం. భూమికి బదులుగా భూమి ఇవ్వాలని బహదూర్ గూడ రైతులు డిమాండ్ చేశారు. డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ సామరస్యంగా సమస్యను బహదూర్ గూడా రైతులు పరిష్కరించుకోవాలని తెలిపారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించి కారంపొడి, రాళ్లు, కుర్చీలతో దాడులు సరికావు అన్నారు. ఆవేశంతో కాదు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. శాంతి భద్రతలకు విగాథం కలగకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

# సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధం

**హైదరాబాద్, మహా :** వాతావరణ మార్పుల కారణంగా నిపుణులు హెచ్చరిస్తున్న "సూపర్ ఎల్ నినో" పరిస్థితులు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో వర్షపాతం, జలవనరులపై ప్రభావం చూపే అవకాశముందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశార



# కమిటీ కుర్రోళ్ళకు నేషనల్ అవార్డ్

(మొదటి పేజీ తరువాయి )

పొందిన 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైంది. దీంతో పాటు అదే చిత్రానికి పనిచేసిన పి. రవికుమార్ ఉత్తమ మేకప్ ఆర్టిస్టుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రానికి నితిన్ జిహానీ చౌదరి ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో జాతీయ అవార్డును అందుకున్నారు. విజువల్ గ్రాండియర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రానికి మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కిన 'పుష్ప2' చిత్రానికి దర్శకుడు సుకుమార్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా ఎంపికయ్యారు. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రానికి దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డును గెలుచుకున్నారు. అలాగే '35 ఇది చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా ఎంపిక కాగా, అందులో నటించిన బాల నటులకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.తర ప్రధాన విభాగాల్లో తమిళ చిత్రం 'అమరన్' సత్తా చాటింది. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా, జి.వి. ప్రకాష్ కుమార్ ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా, ఆర్. కలైవన్నన్ ఉత్తమ ఎడిటర్‌గా ఎంపికయ్యారు. 'మహారాజా' చిత్రానికి ఆనందు అరసు ఉత్తమ యాక్షన్ డైరెక్టర్‌గా, సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటిగా జాతీయ పురస్కారాలు అందుకున్నారు.




ఈ ఏడాది జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో కంటెంట్ ఆధారిత చిత్రాలతో పాటు వాణిజ్యపరంగా విజయవంతమైన సినిమాలు కూడా సమానంగా గుర్తింపు పొందడం విశేషం. ముఖ్యంగా తెలుగు చిత్రాలు పలు విభాగాల్లో అవార్డులు దక్కించుకోవడం టాలీవుడ్‌కు మరో గౌరవంగా నిలిచింది.

| ప్రధాన అవార్డులు | |
|---|---|
| ఉత్తమ చిత్రం | ఆర్టికల్ 370 |
| ఉత్తమ నటులు | మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) |
| ఉత్తమ నటి | యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) |
| ఉత్తమ దర్శకుడు | రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్) |
| ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం | కల్కి 2898 ఏడీ |
| **ప్రాంతీయ భాషల్లో ఉత్తమ చిత్రాలు** | |
| తెలుగు | కమిటీ కుర్రోళ్లు |
| తమిళం | రాయన్ |
| హిందీ | శ్రీకాంత్ |
| మలయాళం | ఫెమినా ఫాతిమా |
| కన్నడ | మిథ్య |

# చరిత్ర సృష్టించిన విక్రమ్-1

( మొదటి పేజీ తరువాయి )

గుర్తింపు లభించింది. విక్రమ్ 1 ప్రయోగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వీక్షించారు. రాకెట్ విజయవంతంగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన వెంటనే స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్ చేసి ప్రధాని అభినందనలు తెలిపారు. ఈ చారిత్రక విజయాన్ని సాధించిన యువ ఇంజనీర్లు, శాస్త్రవేత్తల కృషిని ప్రత్యేకంగా ప్రశంసిస్తూ దేశం మొత్తం గర్వించే ఘనతను సాధించారని కొనియాడారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం దేశ అంతరిక్ష రంగానికి కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరగడం వల్ల సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని, దేశ సాంకేతిక సామర్థ్యం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విక్రమ్ 1 విజయంతో 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పం మరోసారి సాకారమైందని ప్రధాని అభిప్రాయపడ్డారు. స్వదేశీ సాంకేతికతతో ప్రపంచ స్థాయి అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించే సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ ప్రయోగం నిరూపించిందన్నారు. భవిష్యత్తులో భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ప్రపంచ మార్కెట్లో మరింత కీలక పాత్ర పోషిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్కైరూట్ టీమ్ ను అభినందించారు.

**విక్రమ్-1 విజయంపై సీఎం రేవంత్ హర్షం**

భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్ 1' విజయవంతమైన ప్రయోగంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన, హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సాధించిన ఈ ఘన విజయం భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విక్రమ్ 1 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడం దేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ ఈ ఘనత సాధించడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ చిరునామాగా మారుతోందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యం, స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఈ విజయం ప్రపంచస్థాయి గుర్తింపును తీసుకువచ్చిందని తెలిపారు. సాంకేతిక రంగంలో తెలంగాణ యువత ప్రతిభను ప్రపంచం మరోసారి గుర్తించేలా ఈ విజయం నిలిచిందన్నారు. విక్రమ్ 1 విజయాన్ని సాకారం చేసిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారత ప్రైవేట్ స్పేస్ రంగం ప్రపంచ స్థాయిలో తన సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి మరిన్ని వినూత్న ఆవిష్కరణలు వెలువడాలని, అంతరిక్ష రంగంలో రాష్ట్రం మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. "విక్రమ్ 1 విజయం భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త దిశను చూపడమే కాకుండా, తెలంగాణ నుంచి ప్రపంచాన్ని చేరుకునే సాంకేతిక శక్తికి ప్రతీకగా నిలిచింది" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మతం మారితే ఎస్సీ హోదా వర్తించదు.

**ఢిల్లీ, మహా. :** మత మార్పిడి, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా, రిజర్వేషన్లు, ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు మరోసారి కీలకమైన స్పష్టత ఇచ్చింది. రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్-1950లో పేర్కొనబడని మతంలోకి మారిన వ్యక్తి, ఆ మతాన్ని కొనసాగిస్తున్నంతకాలం ఎస్సీ హోదా ఆధారంగా రాజ్యాంగపరమైన ప్రయోజనాలు లేదా ఎస్సీ/ఎస్టీ చట్టం కింద రక్షణ కోరలేదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. చింతాడ ఆనంద్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తదితరుల కేసులో దాఖలైన రివ్యూ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఈ అంశంపై గతంలో ఇచ్చిన తీర్పును యథాతథంగా కొనసాగించింది.ఈ కేసులో పుట్టుకతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఫిర్యాదుదారుడు అనంతరం క్రైస్తవ మతాన్ని స్వీకరించి, దశాబ్దకాలంగా పాస్టర్‌గా సేవలు అందిస్తున్నట్లు రికార్డుల్లో ఉంది. గ్రామంలో క్రమం తప్పకుండా ప్రార్థనలు నిర్వహిస్తూ క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నప్పటికీ, తనపై జరిగిన ఘటనలో ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, 1950 రాజ్యాంగ ఆర్డర్ ప్రకారం ఎస్సీ హోదా పొందాలంటే అందులో పేర్కొన్న మతాల్లోనే ఉండాలని, ఒకే సమయంలో క్రైస్తవ మతాన్ని ఆచరిస్తూ ఎస్సీ హోదా ప్రయోజనాలను పొందడం సాధ్యం కాదని తీర్పు ఇచ్చింది. అదే తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశాల్లో ప్రధానమైనది ఏమిటంటే, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం చేతిలో ఉండటం మాత్రమే సరిపోదు. ఒక వ్యక్తి వాస్తవంగా 1950 ఆర్డర్ పరిధిలో లేని మతాన్ని అనుసరిస్తే, కేవలం సర్టిఫికెట్ రద్దు కాలేదనే కారణంతో ఎస్సీ హోదా ఆధారంగా చట్టపరమైన రక్షణ లేదా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందే హక్కు కలుగదని ధర్మాసనం పేర్కొంది.జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం జూలై 15న చింతాడ ఆనంద్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను పరిశీలించింది. విధానపరమైన కొన్ని లోపాలను పక్కనపెట్టి పిటిషన్‌ను పరిశీలించినప్పటికీ, గతంలో ఇచ్చిన తీర్పులో ఎలాంటి స్పష్టమైన తప్పిదం లేదా చట్టపరమైన లోపం కనిపించలేదని పేర్కొంటూ రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే పిటిషనర్ కోరిన మౌఖిక విచారణ అభ్యర్థనను కూడా తిరస్కరించింది.

ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు మరోసారి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్, 1950లోని నిబంధనలకే ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుతం ఆ ఆర్డర్ ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే షెడ్యూల్డ్ కులాలకే ఎస్సీ హోదా వర్తిస్తుంది. ఇతర మతాలను స్వీకరించిన సందర్భంలో ఎస్సీ హోదా కొనసాగుతుందా లేదా అన్న అంశంపై చట్టం ఏం చెబుతుందో అదే అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

ఈ తీర్పు భవిష్యత్తులో ఎస్సీ హోదా, రిజర్వేషన్లు, ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు సంబంధించిన అనేక కేసుల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఈ తీర్పు ప్రస్తుత రాజ్యాంగ నిబంధనల వివరణకు సంబంధించినది మాత్రమే అని, ఎస్సీ హోదా పరిధిని విస్తరించడం లేదా మార్చడం వంటి అంశాలు శాసనసభ, పార్లమెంట్ లేదా రాజ్యాంగపరమైన విధాన నిర్ణయాలకు సంబంధించినవని న్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ తీర్పు నేపథ్యంలో మత మార్పిడి, రిజర్వేషన్ హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ నిబంధనల అమలు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చ ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. రాజకీయ, సామాజిక, న్యాయ వర్గాల్లో ఈ తీర్పు ప్రభావంపై విస్తృత చర్చ కొనసాగే అవకాశముంది.

# బండి–ఈటల అలయ్ బలయ్

**లక్ష్మణ్ నివాసంలో బిజెపి ఇన్ ఛార్జి సంధి చర్చలు**

**హైదరాబాద్, మహా:** చాలా కాలంగా రాజకీయంగా ఉప్పునిప్పులా ఉంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్యకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ కీలక పాత్ర పోషించారు. శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ నివాసంలో జరిగిన సమావేశంలో అభయ్ పాటిల్ సమక్షంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ ముఖాముఖిగా చర్చించారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడం లక్ష్యంగా గత విభేదాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని అభయ్ పాటిల్ ఇద్దరు నేతలకు సూచించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, ఈటల రాజేందర్ తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, పార్టీ ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు మందగించడం వల్ల కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, అదే రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్ సర్కారు రానివ్వను

కేసీఆర్ సర్కారు రానివ్వను

( మొదటి పేజీ తరువాయి )

నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. "నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్ 1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో,



హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.




## ఒక్క పెళ్ళిచేసుకున్నవారే..
# రాష్ట్రంలో ఉంటారు

**మధ్యప్రదేశ్ సీఎం సంచలన వ్యాఖ్యలు**

**భోపాల్:** బీజేపీకి చెందిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నివసించాలంటే కేవలం ఒక్క వివాహం మాత్రమే చేసుకుని ఉండాలన్నారు. ఈ మేరకు త్వరలో యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్ అమలులోకి తెచ్చే యత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పౌరులందరికీ ఒకే రకమైన చట్టం ఉండేలా చేయడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు.

# ఏపీలో చెత్త లేకుండా చేస్తాం

**ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన**

**గుడివాడ, మహా :** పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు. క్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే..! ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తాం...!

- ఇళ్ల స్థలాలిచ్చి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు
- కాకర్లపల్లిలో ఇళ్ల స్థలాల పోరాట సాధన సదస్సు

**సత్తుపల్లి, జులై 18: మహా :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే వరకు పోరాటం ఆపేది లేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో పాలకులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ భూముల్లో పేదలతో గుడిసెలు వేయించడం జరుగుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు స్పష్టం చేశారు. ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి అధ్యక్షతన మండలంలోని కాకర్లపల్లిలో నిర్వహించిన 'ఇళ్ల స్థలాల పోరాట సాధన సదస్సు'లో వెంకట్రాములు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాకర్లపల్లి గ్రామ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను మట్టితో పూడ్పించగా ఆ తేలే 34 ఎకరాల భూమిని పేదల ఇళ్ల స్థలాలకు పంచాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రుల వరకు ఎన్నిసార్లు విన్నవించినా పాలకుల్లో కనికరం లేకపోవడం శోచనీయమన్నారు. కాలువ పూడ్పించి పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయిస్తామని గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. పేదల న్యాయమైన హక్కుల కోసం ఐద్వా, వ్యకాస ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గత ఏడాది కాలంగా ధర్నాలు, పాదయాత్రలు, రిలే నిరాహార దీక్షలు, ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడి వంటి అనేక ఆందోళనలు చేపట్టామని, అయినా పాలకులకు కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలు చేస్తున్న క్రమంలో పేదలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో మహిళలు విరోచితంగా ఇళ్ల స్థలాల సాధన ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొనడంపై ఆయన అభినందించారు. జిల్లా సాధన కోసం జరిగే పోరాటానికి వ్యకాస రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఇక్కడి పేదల ఇళ్ల స్థలాల సమస్యను వివరిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సదరు ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసి ఆక్రమిస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఈ సదస్సులో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, వ్యకాస జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మోరంపూడి పాండురంగారావు, కొలికిపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, బండి వేలాద్రి, కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ల రామకృష్ణ, కొప్పుల చిన్నస్వామి, దాట్ల రాంబాబు, ఆంగోతు చిట్టెమ్మ, పరిమి సీతామహాలక్ష్మి, బెజవాడ లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి నాయకులు షేక్ ఇమామ్ సాహెబ్, కండే సత్యం అయినంపూడి ననందనరావు, మిట్టపల్లి నాగమణి అలివేలు, స్థానిక ప్రజాసంఘాల నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేపర్ లీక్‌లతో లక్షల కుటుంబాలు నష్టపోయాయి

- పరీక్షల వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలి.
- లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ .



**డెహ్రాడూన్, మహా:** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, పరీక్షల వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం అనంతరం బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థిని రియా తండ్రి రాజేశ్‌ను డెహ్రాడూన్‌లో కలిసిన అనంతరం ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.
రియా తండ్రి అనుభవించిన వేదన తనను తీవ్రంగా కలిచివేసిందని రాహుల్ గాంధీ తెలిపారు. ఇది ఒక్క కుటుంబానికి పరిమితమైన విషాదం కాదని, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఇలాంటి బాధను అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వెనుక ఒక కుటుంబం, వారి కలలు, ఆశలు ఉంటాయని, వాటిని కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
విద్యార్థులు పరీక్షల సమయంలో భయం, అనిశ్చితి కాకుండా భద్రత, నమ్మకాన్ని అనుభవించే విధంగా పరీక్షల వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల త్యాగాలకు ప్రతిఫలంగా కన్నీళ్లు కాకుండా విజయాలు దక్కేలా వ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందన్నారు.
శుక్రవారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో రాహుల్ గాంధీతో మాట్లాడిన రియా తండ్రి రాజేశ్, తన కుమార్తె మరణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పరీక్ష బాగా రాశానని ఆనందంగా ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ప్రశ్నాపత్రం లీక్ అయిన వార్త తెలిసి తీవ్ర మనస్తాపానికి గురైందని తెలిపారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయం మరో విద్యార్థికి జరగకూడదని, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చూడాలని రాహుల్ గాంధీని కోరారు.
దేశంలో పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ జూన్ 17న రాజస్థాన్‌లోని కోటా నుంచి 'ఛాత్రోన్ కీ గూంజ్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాహుల్ గాంధీ పలు రాష్ట్రాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు.
గత పదేళ్లలో ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ సమస్యను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత దశాబ్దంలో దేశవ్యాప్తంగా 152 ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలు జరిగినప్పటికీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.
పరీక్షా పత్రాల లీకేజీల కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. డబ్బు ఉంటే ఇంటర్నెట్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ వేదికల్లో ప్రశ్నాపత్రాలు అందుబాటులోకి వస్తున్నాయని ఆరోపించారు. ఇది దేశ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభానికి నిదర్శనమని పేర్కొన్నారు.పరీక్షల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు విద్యార్థుల కఠోర శ్రమను, తల్లిదండ్రుల ఆశలను దెబ్బతీస్తున్నాయని పేర్కొంటూ, భారత యువత భవిష్యత్తును కాపాడేందుకు కఠిన చర్యలు, సమగ్ర సంస్కరణలు అత్యవసరమని ఆయన పునరుద్ఘాటించారు.

# దమ్మాయిగూడలో రోడ్డు ప్రమాదం

**ఘటనా స్థలంలోనే 13 ఏళ్ల బాలుడు మృతి**

కుషాయిగూడ, మహా : జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ పరిధిలోని శివనగర్లో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... దమ్మాయిగూడ లోని శివనగర్ లో మహమ్మద్ సిరాజ్ దంపతులు ఇద్దరు పిల్లలతో టైలరింగ్ పని చేసుకుంటూ నివాసముంటున్నారు. ఈ మేరకు శనివారం ఉదయం సిరాజ్ చిన్న కుమారుడు సుఫియాన్ (13) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. ఈ మేరకు శనివారం సుఫియాన్ ను స్కూల్లో దింపి రావడానికి పెద్ద కుమారుడు సైఫ్ సోదరుని స్కూటీపై దించి రావడానికి అని వెళుతుండగా మార్గ మధ్యలో లేబర్ అడ్డా వద్ద గుర్తుతెలియని ఇసుక లారీ అతివేగంగా నిర్లక్ష్యంగా స్కూటీని ఢీకొట్టడంతో. సుఫియాన్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుడు సెయింట్ ఆంథోనీ గ్రామర్ స్కూల్ విద్యార్థి. ప్రమాద సమయంలో తన సోదరులు సైఫ్ తో కలిసి స్కూటీపై వెళ్తుండగా లారీ ఢీకొనగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న జవహర్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# రావోజీతండాలో వైద్య శిబిరాన్ని ప్రారంభం

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం రావోజీ తండాలో శనివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కారేపల్లి పీహెచ్సీఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్నిసర్పంచ్ భూక్య బాలు ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రావోజీతండా పంచాయతీలో పారిశుధ్యంపై రాజీ పడటం లేదన్నారు. వీధులు శుభ్రంగా ఉంచటంతో పాటు బ్లీచింగ్ చల్లటం, మురుగునీరునిల్వ లేకుండా చూస్తున్నట్లు తెలపారు. గ్రామస్తుల సహకారం, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తోడ్పాటుతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జీపీకార్యదర్శి కొండపల్లి ప్రవీణ్, ఏఎన్ఎం నాగమణి, అంగన్ వాడీ టీచర్ కృష్ణవేణి, బిందు, ఆశా సుజాత తదితరులు పాల్గొన్నారు.



# బండి–ఈటల అలయ్ బలయ్

**లక్ష్మణ్ నివాసంలో బిజెపి ఇన్ ఛార్జి సంధి చర్చలు**

**హైదరాబాద్, మహా :** చాలా కాలంగా రాజకీయంగా ఉప్పునిప్పులా ఉంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్యకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ కీలక పాత్ర పోషించారు. శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ నివాసంలో జరిగిన సమావేశంలో అభయ్ పాటిల్ సమక్షంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ ముఖాముఖిగా చర్చించారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడం లక్ష్యంగా గత విభేదాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని అభయ్ పాటిల్ ఇద్దరు నేతలకు సూచించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, ఈటల రాజేందర్ తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, పార్టీ ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు మందగించడం వల్ల కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, అదే రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేజీబీవీలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**కారేపల్లి, మహా:** కారేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి జిల్లావిద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ జీ.ఝాన్సీ సౌజన్య శనివారం తెలిపారు. 7వ తరగతిలో 3 ఖాళీలు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలలో రెండు చొప్పున ఖాళీగా ఉన్నట్లు ఎస్వో తెలిపారు. విద్యారులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వసతి తోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకావు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. బాలికలకు మహిళా సిబ్బంది పర్యవేక్షణలో పూర్తి రక్షణ కల్పించటం జరుగుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 14 కేజీబీవీలలో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్.ఆర్.ఎస్) హాజరులో స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ ద్వారా అధికంగా ప్రశంసపత్రాలను కారేపల్లి కేజీబీవీ అందుకుందన్నారు. ఆసక్తి కల విద్యార్థులు దృవీకరణ పత్రాలతో విద్యాలయ పని వేళ్లలలో సంప్రదించాలని కోరారు.



# పేరుపల్లి పాఠశాలలో పలకల పంపిణి

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం పేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పలక, ఇతర విద్య సామాగ్రిని శనివారం పంపిణి చేశారు. పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మావతివీరభద్రం చేతుల మీదిగా విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, మధ్యహ్నన భోజనం అందిస్తూ నైపుణ్యం కల్గిన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతుందనివాటిని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్యామ్ లాల్, వార్డు సభ్యులు బానోత్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలే ఆమె ఆయుధం

**ప్రపంచ రికార్డు కొట్టిన విద్యార్థి దుర్గం మహాలక్ష్మికి ఘన సన్మానం.**

**పాలకుర్తి, జూలై 18 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని పాలకుర్తి గ్రామానికి చెందిన విద్యార్థిని దుర్గం మహాలక్ష్మి అసాధారణ ప్రతిభను కనబర్చి, ప్రపంచ స్థాయి రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు.భౌతిక పరిమాణాల యూనిట్లను అత్యంత వేగంగా రాసి, ప్రపంచ రికార్డును సాధించడం ద్వారా ఆమె తన గ్రామానికి, జిల్లాకు గొప్ప పేరు తెచ్చిపెట్టారు.ఈ అద్భుత ఘనత సాధించిన మహాలక్ష్మిని గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల తన పాలకవర్గంతో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మహాలక్ష్మి సాధించిన ఈ విజయం పాలకుర్తి గ్రామానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టిందని సర్పంచ్ పెద్దపల్లి తిరుమల కొనియాడారు.మహాలక్ష్మి మరిన్ని విజయాలను సాధించాలని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని, పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ప్రస్తావించారు.ఈ సన్మాన కార్యక్రమంలో సర్పంచి తో పాటు వార్డు సభ్యులు దూట మల్లేష్, దుర్గం ఉషారాణి మరియు గ్రామస్తులు, మహాలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# ట్రైనీ డీఎస్పీలకు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ప్రత్యేక శిక్షణ

**కేస్ స్టడీగా పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు ఛేదన వివరాలు**

**కరీంనగర్ మహా :** తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది గ్రూప్1 ట్రైనీ డీఎస్పీలకు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు దర్యాప్తును కేస్ స్టడీగా వివరిస్తూ ప్రత్యేక శిక్షణ అందించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ఈ శిక్షణ సదస్సు సుమారు మూడున్నర గంటలపాటు సాగింది.ఈ సందర్భంగా గౌష్ ఆలం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసును అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, డేటా విశ్లేషణ, క్షేత్రస్థాయి దర్యాప్తు, వివిధ రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో ఎలా ఛేదించామనే అంశాలను ట్రైనీ అధికారులకు వివరించారు.నిందితులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినప్పటికీ, తెలంగాణ పోలీసు శాఖ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సాధనాలు, సమర్థవంతమైన దర్యాప్తు, టీమ్‌వర్క్‌తో కేసును విజయవంతంగా ఛేదించగలిగిందని తెలిపారు. ఈ విజయానికి పై అధికారుల మార్గదర్శకత్వం, దర్యాప్తు బృందం సమష్టి కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా తెలంగాణ పోలీసు ప్రత్యేక బృందాలు బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర (ముంబై), కర్ణాటక (బెంగళూరు) ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టాయని తెలిపారు. ఆయా రాష్ట్రాల పోలీసుల సహకారంతో ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు సుబోధ్ సింగ్ సహా మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసిన విధానాన్ని వివరించారు.సదస్సులో పాల్గొన్న కరీంనగర్ ఏసీపీలు, దర్యాప్తు అధికారులు నిందితులను గుర్తించడం, ఆధారాల సేకరణ, అంతర్రాష్ట్ర సమన్వయం, క్షేత్రస్థాయిలో ఎదురైన సవాళ్లను ట్రైనీ అధికారులతో పంచుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం, సమన్వయం, సమష్టి కృషి ఉంటేనే క్లిష్టమైన కేసులను విజయవంతంగా ఛేదించవచ్చని తెలిపారు.లభవిష్యత్తులో ట్రైనీ అధికారులు విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడంలో ఈ కేస్ స్టడీ ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్లు సృజన్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, తిరుమల్, ప్రకాష్, సరిలాల్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పై విస్తృత ప్రచారం చేయాలి

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, తాజా మాజీ కార్పొరేటర్**



**వరంగల్, మహా ;**ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్,22వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి అన్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గం 22 వ డివిజన్ లో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఎస్.ఐ.ఆర్ ద్వారా ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా, పారదర్శకంగా తయారు చేస్తారని తెలిపారు.

**ఎస్.ఐ.ఆర్ అంటే ఏమిటి?**

ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో కొత్త ఓటర్ల నమోదు, పేరు తొలగింపులు, చిరునామా మార్పులు, డూప్లికేట్ పేర్ల తొలగింపు వంటివి జరుగుతాయని మీసాల ప్రకాష్ వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించారు.

**బస్వరాజు కుమారస్వామి మాట్లాడుతూ**

ఓటు లేకుంటే ప్రజాస్వామ్యంలో మన గొంతు వినిపించదు. చాలా మంది పేర్లు తప్పులుగా ఉండడం, మారడం వల్ల తమ ఓటు హక్కు కోల్పోతున్నారు. అందుచేత ఈ సర్ ప్రక్రియ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా డివిజన్ లోని కాలేజీలు, పాఠశాలలు, వార్డుల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.
ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ చామల శ్రీనివాస్, బి ఎల్ ఎ లు, స్థానిక నాయకులు జన్ను ప్రమోద్ చిన్న సుధాకర్ సయ్యద్ సాబీర్, రైల్వే ప్రభాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపరచాలి

**పాఠశాలలు మూసివేసే ప్రయత్నం విరమించుకోవాలి - వ్యకాస, ఐద్వా**



**కారేపల్లి, మహా :** సర్కార్ స్కూళ్లలో సౌకర్యాల కల్పన పట్ల చూపిస్తుందని ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు లు విమర్శించారు. శనివారం మాణిక్యారం, కోమట్ల గూడెం పాఠశాలలను వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం బృందం సర్వే నిర్వహించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిలబస్ కు తగినంత టీచర్స్ లేక నాణ్యమైన విద్య అందటం లేదన్నారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్లు ఇచ్చిన పాలకులు భోధించే టీచర్లను మాత్రం నియమించలేదన్నారు. పిఈటి లు లేరు, ఆట స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి అన్నారు. బాలబాలికలకు వేరు వేరు టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని, మంచి నీరు, వంట షెడ్డు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీకి ప్రభుత్వమే ఉచిత వంట గ్యాస్ అందించాలని, విద్యార్థులకు యూనిఫామ్,టై,బెల్ట్ షూస్ అందించాలని, స్కాలర్షిప్ విడుదల చేయాలని కోరారు. సౌకర్యాలు లేక విద్యార్థుల దూరమవుతుంటే బడుల్లో పిల్లలు లేరంటూ 24 వేల ప్రభుత్వ పాఠశాల 4 వేలకు కుదించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఆప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. హై స్కూల్ స్థాయి స్థాయి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం టిఫిన్ కోడిగుడ్డు లాంటి పౌష్టికాహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై ఆందోళన పోరాటాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, చల్ల మల్లమ్మ, కరపటి అరుణ, రేమల్ల వీరస్వామి, ఐద్వా నాయకురాలు కొండబోయిన ఉమావతి, కేసగాని నీలిమ, మేకల స్వరూప, కరపటి సీతమ్మ, అజ్మీర జ్యోతి, కలమ్మ, విజయ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


# ఎర్ర చీరలో మెరిసిన పాయల్ రాధాకృష్ణ షెనోయ్

దక్షిణ భారత సినీ పరిశ్రమలో తన అందం, అభినయం, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి పాయల్ రాధాకృష్ణ షెనోయ్ తాజాగా ఎర్రటి చీరలో కనిపించిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. బంగారు అంచులతో అలంకరించిన ఎర్ర చీరలో చిరునవ్వుతో ఎంతో ఆత్మవిశ్వాసంగా, హుందాగా పోజులిచ్చిన ఆమె అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ఫోటోలకు ఆమె ఇచ్చిన "ఎర్ర చీరలో నన్ను నేను ప్రేమించుకున్న రోజు" అనే క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మంగళూరుకు చెందిన పాయల్ రాధాకృష్ణ షెనోయ్ తొలుత మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, అనంతరం సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 2017లో విడుదలైన కన్నడ చిత్రం 'బెంగళూరు అండర్‌వర్ల్డ్' ద్వారా హీరోయిన్‌గా పరిచయమైన ఆమె, 2019లో వచ్చిన 'భిన్న' చిత్రంలో తన అద్భుత నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందగా, మాడ్రిడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సహా పలు అవార్డులను సొంతం చేసుకుంది.vకన్నడతో పాటు తెలుగు, తమిళ చిత్రాల్లోనూ పాయల్ తన ప్రతిభను చాటుకుంటున్నారు. 'అలా నిన్ను చేరి', 'ప్రసన్న వదనం' వంటి తెలుగు చిత్రాల్లో నటించిన ఆమె, వెబ్ సిరీస్‌లలో కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా 'సింగా పెన్నే' వంటి ప్రాజెక్టుల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. గ్లామర్‌తో పాటు పాత్రకు తగ్గట్టుగా నటించే సామర్థ్యంతో ఆమె ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటున్నారు.


ప్రస్తుతం పాయల్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. 'పాపం ప్రతాప్', 'చౌర్య పాఠం' వంటి కన్నడ, తెలుగు చిత్రాలతో పాటు 2025-2026లో విడుదల కానున్న మరిన్ని సినిమాల్లో ఆమె కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోడలింగ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, సినిమాలు అనే మూడు రంగాల్లోనూ సమతూకంగా ముందుకు సాగుతూ, దక్షిణ భారత సినీ పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నారు.



## కష్టాలే నన్ను తీర్చిదిద్దాయి: కిరణ్ అబ్బవరం



టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం తన జీవిత ప్రయాణం, చిన్ననాటి జ్ఞాపకాలు, సినీ కెరీర్ కోసం పడిన కష్టాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జూలై 24న విడుదల కానున్న 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన తల్లి చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో తాను హాస్టల్‌లో ఉండగా, కుటుంబం కోసం తన తల్లి కువైట్‌లో ఉద్యోగం చేసేదని కిరణ్ తెలిపారు. అప్పట్లో ఆమె ఎందుకు దూరంగా ఉండాల్సి వచ్చిందో పూర్తిగా అర్థం కాలేదని, కానీ ఇప్పుడు తాను తండ్రి అయిన తర్వాత ఆమె పడిన బాధ, చేసిన త్యాగం విలువ తెలిసిందన్నారు. "పిల్లలకు దూరంగా ఉండటం ఎంత కష్టమో ఇప్పుడు నాకు అర్థమవుతోంది" అని చెప్పారు.తన చిన్ననాటి గురించి మాట్లాడుతూ.. చదువుపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదని, కాలేజీలో అల్లరి చేసే విద్యార్థిగా పేరుండేదని నవ్వుతూ చెప్పారు. అయితే హాస్టల్ జీవితం తన వ్యక్తిత్వాన్ని మార్చిందని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కలిసి ఉండటం వల్ల జీవితాన్ని చూసే దృక్పథం విస్తరించిందని పేర్కొన్నారు.ఉద్యోగ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ.. తన మొదటి జీతాన్ని ఇంటికి ఇచ్చానని, తర్వాత వచ్చిన జీతంతో బెంగళూరులో షాపింగ్ చేయడం మరపురాని అనుభవంగా నిలిచిందని చెప్పారు. సినిమాల్లో అవకాశాల కోసం ఉద్యోగాన్ని వదిలేసిన తర్వాత ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని, రోజుకు 13 నుంచి 14 కిలోమీటర్లు నడిచి అవకాశాల కోసం ప్రయత్నించిన రోజులు కూడా ఉన్నాయని వెల్లడించారు.ప్రస్తుత తరం ప్రేమ, రిలేషన్‌షిప్స్‌పై స్పందించిన కిరణ్.. ప్రేమలో నిజమైన భావోద్వేగం, ఒకరినొకరు అర్థం చేసుకునే విలువ ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు.



## నోలన్ మ్యాజిక్.. భారత్‌లో 'ది ఒడిస్సీ' దుమ్మురేపిన ఓపెనింగ్స్

హాలీవుడ్ స్టార్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన తెరకెక్కించే ప్రతి చిత్రం ప్రేక్షకులకు ఒక ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది. తాజాగా విడుదలైన 'ది ఒడిస్సీ' కూడా అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ భాత్‌లో బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని నమోదు చేసింది.హోమర్ రచించిన ప్రఖ్యాత గ్రీకు ఇతిహాసం ఆధారంగా రూపొందిన ఈ హిస్టారికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రం జూలై 17, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. భారత్‌లోనూ తెలుగుతో పాటు పలు భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. సుమారు 250 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.2,000 కోట్లకు పైగా) బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంపై విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి.

అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైనప్పటి నుంచే 'ది ఒడిస్సీ' సంచలనం సృష్టించింది. ముఖ్యంగా ముంబై, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో ఐమ్యాక్స్ షోలకు సంబంధించిన టికెట్లు విడుదలైన కొద్ది రోజుల్లోనే హౌస్‌ఫుల్ అయ్యాయి. నోలన్ సినిమాను ఐమ్యాక్స్‌లోనే చూడాలనే ఆసక్తితో ప్రేక్షకులు పెద్ద ఎత్తున టికెట్లు బుక్ చేసుకోవడం విశేషం.ఈ ప్రభావం తొలి రోజు వసూళ్లలోనూ స్పష్టంగా కనిపించింది. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం 'ది ఒడిస్సీ' భారతదేశంలో మొదటి రోజే రూ.23 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. మార్వెల్ లేదా అవతార్ వంటి ఫ్రాంచైజీల మద్దతు లేకుండానే, కేవలం క్రిస్టోఫర్ నోలన్ పేరు, ఆయన చిత్రాలపై ప్రేక్షకుల్లో ఉన్న నమ్మకమే ఈ స్థాయి ఓపెనింగ్స్‌కు ప్రధాన కారణమని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అమీర్ ఖాన్‌కు బెదిరింపులు.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

బాలీవుడ్‌లో వరుసగా సెలబ్రిటీలకు వస్తున్న బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నటుడు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకున్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, ఇప్పుడు బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్‌ను కూడా టార్గెట్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల అమీర్ ఖాన్‌కు సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారం ప్రస్తుతం ముంబై సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అర్జూ బిష్ణోయ్, అలాగే టైసన్ బిష్ణోయ్ పేర్లతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ పోస్టులో అమీర్ ఖాన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో 'లవ్ జిహాద్'ను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ, అలాంటి చర్యలను తాము సహించబోమని పేర్కొన్నారు. సనాతన ధర్మానికి, దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై తమదైన రీతిలో చర్యలు తీసుకుంటామని, ఇదే మొదటి, చివరి హెచ్చరిక అంటూ పోస్టులో పేర్కొన్నట్లు సమాచారం.

అదే పోస్టులో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో గత నెల జరిగిన 13 ఏళ్ల బాలిక కిడ్నాప్, లైంగిక దాడి ఘటనను కూడా ప్రస్తావించారు. ఆ కేసులో పోలీసులు తీసుకున్న వేగవంతమైన చర్యలను అభినందిస్తూనే, కొందరు రాజకీయ నాయకులు నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చట్టం నుంచి తప్పించుకోవాలని చూసే నిందితులకు, వారికి మద్దతు ఇచ్చే వారిపై తామే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అలాగే తమ ముఠాకు చెందిన పర్వేష్, హిమాన్షు త్యాగాలను వృథా కానివ్వమని కూడా పోస్టులో పేర్కొన్నారు.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఫేస్బుక్‌లో వైరల్ అయిన పోస్టు, ఒక వాయిస్ నోట్ ఆధారంగా ఈ బెదిరింపుల అంశంపై సమాచారం అందింది. ప్రస్తుతం దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే అమీర్ ఖాన్ లేదా ఆయన ప్రతినిధుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని వెల్లడించారు. ఒకవేళ లిఖితపూర్వక ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసి అవసరమైన భద్రతా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.




# ఎలివేటర్ సెల్ఫీలో మెరిసిన త్రిష

దక్షిణ భారత సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా స్టార్ హీరోయిన్‌గా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న త్రిష కృష్ణన్, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎలివేటర్‌లో తీసుకున్న మిర్రర్ సెల్ఫీలో స్టైలిష్ వెస్ట్రన్ లుక్‌లో మెరిసిపోయిన ఆమె, "కొన్ని రోజులు... సూర్యకిరణాలు తాకే తీరు కూడా ప్రత్యేకంగా ఉంటుంది" అనే క్యాప్షన్‌తో ఫోటోలను పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల నుంచి విశేష స్పందన అందుకుంటున్నాయి.ఫ్యాషన్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే త్రిష ఈసారి జారా బ్రాండ్‌కు చెందిన మార్సాలా పింక్ రంగు స్లీవ్‌లెస్ వేస్ట్‌కోట్‌తో పాటు మ్యాచింగ్ బాటమ్‌ను ధరించింది. దీనికి బోల్డ్ మెటాలిక్ బకిల్ ఉన్న లెదర్ బెల్ట్‌ను జత చేసి మరింత స్టైలిష్‌గా కనిపించింది. చేతికి ధరించిన గోల్డ్ బ్యాంగిల్స్, ఆకర్షణీయమైన రింగ్, ఆమె ప్రత్యేకమైన వేవీ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌కు మరింత హుందాతనాన్ని తీసుకొచ్చాయి.2002లో సూర్య సరసన వచ్చిన తమిళ చిత్రం 'మౌనం పేసియాదే'తో హీరోయిన్‌గా సినీ రంగంలోకి అడుగుపెట్టిన త్రిష, ఆ తర్వాత ప్రభాస్‌తో 'వర్షం', విజయ్‌తో 'గిల్లి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ముఖ్యంగా 'గిల్లి' చిత్రంలో విజయ్‌తో ఆమె కెమిస్ట్రీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కెరీర్ ప్రారంభించి రెండు దశాబ్దాలకు పైగా గడిచినా, 'విన్నైతాండి వరువాయా', '96', 'పొన్నియిన్ సెల్వన్', 'లియో' వంటి విజయవంతమైన చిత్రాలతో త్రిష తన స్టార్‌డమ్‌ను కొనసాగిస్తోంది.

ఇటీవల దళపతి విజయ్ నటించిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (GOAT)' చిత్రంలోని 'మట్టా' పాటలో ప్రత్యేకంగా కనిపించిన త్రిష తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను అలరించింది. ఆ పాట సోషల్ మీడియాలో భారీ స్థాయిలో ట్రెండ్ అయింది. మరోవైపు 'బృందా' వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీలోకి అడుగుపెట్టి, పోలీస్ అధికారిణి పాత్రలో తన నటనతో ప్రశంసలు అందుకుంది.

ప్రస్తుతం త్రిష చేతిలో పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. అజిత్ కుమార్‌తో 'విడాముయార్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ', కమల్ హాసన్‌తో 'థగ్ లైఫ్', అలాగే 'ఐడెంటిటీ', సూర్యతో 'కరుప్పు' వంటి చిత్రాల్లో ఆమె నటిస్తోంది. వయసు పెరుగుతున్నా గ్లామర్, స్టైల్, చార్మ్ ఏమాత్రం తగ్గలేదని తాజా ఎలివేటర్ మిర్రర్ సెల్ఫీతో మరోసారి నిరూపించిన త్రిషపై అభిమానులు సోషల్ మీడియాలో లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034